క్లుప్తంగా

సేవా వారధులు వలంటీర్లు



వలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ డీఈ నబిరూసూల్

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో వలంటీర్లు సేవా వారధులుగా నిలుస్తున్నారని మున్సిపల్ డీఈ నబిరసూల్ అన్నారు. శనివారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 9వ సచివాలయం పరిధిలోని వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను డీఈ, కౌన్సిలర్ ధర్మారెడ్డి అందజేశారు. 254 మంది వలంటీర్లకు గాను 207 మంది అవార్డులకు ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ సేవా వజ్ర అవార్డుకు ఒకరు, సేవా రత్న అవార్డుకు ఐదుగురు, సేవా మిత్రకు 201 మంది వలంటీర్లను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు.

22న వలంటీర్లకు సత్కారం

వెలుగోడు: మండల పరిధిలోని గ్రామ, వార్డు సచివాలయాల వలంటీర్లకు ఈనెల 22న సత్కరిస్తున్నట్లు ఎంపీడీవో షేక్ అమానుల్లా తెలిపారు. మండలంలో ఇద్దరు సేవా వజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. బోయరేవుల గ్రామానికి చెందిన నాగనంది బాలకష్ణ, వేల్పనూరుకు చెందిన దూదేకుల నబిరసూల్ సేవా వజ్ర అవార్డుకు ఎంపికైనట్లు వెల్లడించారు. సేవా రత్న అవార్డు 5 మందికి ఇస్తారన్నారు.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వెలుగోడు: ఏపీ మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నళిని సూచించారు. ఈ నెల 22 నుంచి జూన్ 7లోపు ఆన్‌లైన్ (https:// apms. apcfss. in, https:// cse. ap. gov. in) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదో తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం ప్రవేశాలుంటాయని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



మంచానికే పరిమితమైన వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సౌజన్య

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారిణి సౌజన్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని నల్లమల్ల అడవీ సమీపంలోని కపిలేశ్వరం, ఎర్రమఠం గ్రామాల్లోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగులను ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది సత్యంరెడ్డి, శాంతమ్మ, నిర్మల, జయమణి, ఎంఎల్‌హెచ్‌పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల తనిఖీ



ప్రాంతీయ సంచాలకులు నాగలింగారెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న అధ్యాపకులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కళాశాల విద్య ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ డి.నాగలింగారెడ్డి శనివారం తనిఖీ చేశారు. కళాశాల నిర్వహణకు సంబంధించిన అన్ని రిజిస్టర్లు పరిశీలించి పలు సూచనలు చేశారు. కళాశాలలో విద్యార్థుల హాజరు, ఉత్తీర్ణత శాతాన్ని పెంచవలసిన అవసరం ఉందని అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సంచాలకులు నాగలింగారెడ్డికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి హుస్సేన్‌బాషా, అధ్యాపకులు శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామిఅమ్మవార్ల జ్ఞాపికను బహూకరించారు.

మహిళలపై కేసు నమోదు

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన సావిత్రిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఉపాధిహామీ పనుల వద్ద సావిత్రి, అదే గ్రామానికి చెందిన విజయమ్మ, మధులతల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. ఇరువురు మరోసారి ఘర్షణకు దిగి సావిత్రిపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ఆర్థిక సాయం

మిడుతూరు: లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న శ్రీకాంత్‌కు జూనియర్ ఎన్‌టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక సాయం అందజేశారు. జూ.ఎన్‌టీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని సేవా సమితి ఆధ్వర్యంలో అభిమానులు రూ.52వేలు పోగు చేసి శనివారం బాధితునికి అందజేసినట్లు మండల అధ్యక్షుడు ఎంఎం భాషా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చౌదరి, నందికొట్కూరు అధ్యక్షుడు అబ్దుల్లా, ఖాజ, లడ్డూ, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుకు 'మద్దతు'

- ఆత్మకూరు డివిజన్‌లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 50 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- మార్కెట్ కంటే ప్రభుత్వ మద్దతు ధర అధికం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కొనుగోలు కేంద్రంలో రైతులు విక్రయించిన మొక్కజొన్న ధాన్యం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోంది. ఎన్నడూ లేని విధంగా రబీలో కూడా రైతులు అధికంగా సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటకు మద్దతు ధర ప్రకటిస్తూ నియోజకవర్గ వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మద్దతు ధర మార్కెట్‌లో రేటు కంటే అధికంగా ఉండటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు రైతుల ఆసక్తి

ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన రైతులు అత్యధికంగా ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ప్రైవేట్‌వ్యాపారుల కంటే ప్రభుత్వ మద్దతు ధర అధికంగా ఉండడంతో కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారుల వద్ద క్వింటాల్ ధర రూ.1300 నుంచి రూ 1500 మాత్రమే ధర ఉంది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ రూ.1,962 చొప్పున కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు 50 వేల క్వింటాళ్లకు పైగా మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా రైతులు అరకొరగా మిగిలి ఉన్నారు. వారి ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమ

వ్యవసాయమార్కెట్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్న మొక్కజొన్న ధాన్యాన్ని రైతులు విక్రయించిన వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ అవుతున్నాయి. క్వింటాల్ రూ.1,962 చొప్పున ప్రస్తుతం రూ.9.81 కోట్లు విలువ చేసే 50 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తారు. ధాన్యం విక్రయించిన ఐదు, ఆరు రోజులకు బ్యాంకుల్లో నగదు జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

100 క్వింటాళ్లు విక్రయించాం



రబీలో సాగు చేసిన మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించాను. ఆత్మకూరు మార్కెట్‌యార్డ్‌లో ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు ప్రస్తుతం 100 క్వింటాళ్ల ధాన్యాన్ని అమ్మాను. దాదాపు రూ.1,92,000లకు పైగా నగదు బ్యాంక్‌లో జమ అయింది. దళారుల కంటే ప్రభుత్వం ధరకు కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించడం వలన గిట్టుబాటు ధర లభిస్తోంది.
– వెంకటేశ్వర్లు, ఎదురుపాడు

కొనుగోలు కేంద్రం ఊరటనిచ్చింది



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలతో పాటు రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. రైతు భరోసా లాంటి పథకాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషం. మొక్కజొన్నను ప్రైవేట్ వ్యాపారస్తులు తక్కువ ధరకు అడుగుతున్న సమయంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం ఊరటనిచ్చింది. ప్రభుత్వ మద్దతు ధరతో ధాన్యాన్ని మార్కెట్‌యార్డులో విక్రయించాను. –సాహిద్‌బాషా, ఆత్మకూరు

నాలుగైదు రోజుల్లోనే నగదు జమ



రైతులు మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో విక్రయించిన నాలుగైదు రోజుల్లోనే నగదు జమ చేయడం జరుగుతుంది. ఇప్పటికే 50 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యం కొనుగోలు చేశాం. మిగిలిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తాం. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరత్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాం.
– నవీన్‌కుమార్, మార్కెట్‌యార్డు మేనేజర్, ఆత్మకూరు

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో శనివారం కృత్తికా నక్షత్రం సందర్భంగా ఈఓ ఎస్‌లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. స్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు.

మల్లన్న సేవలో జాతీయ మైనార్టీ కమిషన్ కార్యదర్శి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను శనివారం జాతీయ మైనార్టీ కమిషన్ కార్యదర్శి అంజలి భవ్రా దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహించుకున్నారు.

మైనార్టీ కార్పొరేషన్ అధికారుల సమావేశం

శ్రీశైలంప్రాజెక్ట్: మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర స్థాయి అధికారుల సమావేశం శనివారం సున్నిపెంటలోని ఏపీ జెన్‌కో అతిథి గృహంలో జరిగింది. భారత ప్రభుత్వ మైనార్టీ నేషనల్ కమిషన్ సెక్రటరీ అంజలి బౌరా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ, మేనేజింగ్ డైరెక్టర్ షేక్ షరీన్‌బేగం, అడిషనల్ సెక్రటరీ టి.శ్రీనివాసులు, మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ మస్తాన్ , దూదేకుల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ నూర్‌బాషా పాల్గొన్నారు. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు అందు తున్న సంక్షేమ పథకాలు, అమలవుతున్న చట్టాలు, పెండింగ్ అభ్యర్థనలపై చర్చించారు. డీఆర్వో పుల్లయ్య, ఆర్డీఓ దాసు, తహసీల్దార్ రాజేంద్రసింగ్ తరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం

- పేదల సొంతింటి కల నెరవేరుస్తుంటే ఓర్వలేని టీడీపీ నేతలు
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: సొంత ఇళ్లు కట్టుకోవాలన్నది ప్రతి పేదవాడి కల అని, ఎన్నో ఏళ్ల నుంచి తీరని కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తుంటే చూసి ఓర్వలేక సెంటు భూమి శవాన్ని పూడ్చుకునేందుకు సరిపోతుందన్న చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మండిపడ్డారు. బండిఆత్మకూరులో మండల కో ఆప్షన్ మెంబర్ దూదేకుల జమాల్‌బాషా ఇంటివద్ద శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడి పేదవారు ఎంతో ఇష్టంగా పూజలు చేసుకుని ఇళ్లనిర్మాణాలు చేస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తండ్రి చంద్రబాబు, కుమారుడు లోకేష్ అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఆయన చేసేందేమి లేదన్నారు., కేవలం మూడు లక్షల గృహాలను కూడా నిర్మించలేదని చెప్పారు. నాలుగేళ్లలో సీఎం జగన్ 32లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తున్నారన్నారు. నాడు చంద్రబాబు ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలు అవి కర్మభూమి కమిటీలను, కర్మభూమి కమిటీలో సభ్యులు చెప్పినవారికే పథకాలు వచ్చాయన్నది నగ్నసత్యం అన్నారు.

లోకేష్ నిజాలు తెలుసుకుని మాట్లాడు..

నారా లోకేష్ నిజాలు తెలుసుకుని మాట్లాడు అంటూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ కార్యక్రమం ఉంటే అక్కడ నీ దూతలను పంపి, వారు ఏది చెపితే అది మాట్లాడుతూ ఉంటే లోఫర్ లోకేష్ అనక ఇంకేమి అనాలో చెప్పు అంటూ ప్రశ్నించారు. ఎవరికి దొడ్డిదారిన మంత్రి పదవులు వచ్చింది రాష్ట్ర ప్రజలకు అందరికీ తెలుసన్నారు. గత పాలనలో యువకులకు మోసం చేసి నేడు యువగళం యాత్ర చేపట్టడం సిగ్గుగా లేదా అంటూ మండిపడ్డారు. యువకులు పోయారని, కేవలం గళం మిగిలిందని ఎద్దేవా చేశారు. బుడ్డారాజశేఖర్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవడం లేదని, వాస్తవాలను ఎవరు కప్పిపుచ్చలేరన్నారు. మీ స్వంత ఊరు వేల్పనూరులో ఎంత మందికి ఎన్ని కుటుంబాలకు ఈ ప్రభుత్వంలో లబ్ధి చేకూరిందో చూపిస్తా అంటూ సవాల్ విసిరారు. శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం



అవార్డులు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా: సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమైనదని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. శనివారం మండలంలోని పారుమంచాల గ్రామసచివాలయ ఆవరణలో పారుమంచాల, తూడిచెర్ల వలంటీర్ల సన్మానసభను సర్పంచులు ప్రకాశం, బాలమద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ ఇంటింటికి అందజేస్తున్న ఘనత వలంటీర్లదేనన్నారు. వలంటీర్లు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఏటా వారి విధినిర్వహణలో అంకితభావాన్ని గుర్తించి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అనే అవార్డులతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరో పర్యాయం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేలా వలంటీర్లు కృషిచేయాలని సూచించారు. జూపాడుబంగ్లా మండలంలో 170 మందికి సేవామిత్ర, ఐదుగురికి సేవారత్న అవార్డులు వచ్చాయని చెప్పారు. పారుమంచాలలో 26 మందికి, తూడిచెర్లలో 18మందికి సేవామిత్ర అవార్డులు మంజూరైనట్లు తెలిపారు. అనంతరం వలంటీర్లను శాలువ, మెడల్, సర్టిఫికెట్లతో సన్మానించారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి థ్యాంక్స్ చెబుతూ వలంటీర్లు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య, ఎంపీడీఓ మంజులవాణి, ఈఓపీఆర్డీ మణిమంజరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈదుల నారాయణరెడ్డి, శివారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దేవసహాయం, రంగస్వామి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ జగనే సీఎం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

జూపాడుబంగ్లా: ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మరోమారు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావటం తథ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. శనివారం మండలంలోని పారుమంచాల గ్రామంలో సర్పంచ్ మాధవరం ప్రకాశం ఆధ్వర్యంలో రెండో రోజు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పాలనలో పచ్చచొక్కాలు వేసుకున్న వారికి, పలుకుబడి ఉన్నవారికి, లంచాలిచ్చిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు వచ్చేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పార్టీలకు అతీతంగా ఎలాంటి భేదాభిప్రాయాల్లేకుండా అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాడని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల్లో ప్రజల్లో ఆయనకున్న ఆదరాభిమానాలను చూసి ఓర్వలేక చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేష్ నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, సొసైటీ చైర్మన్ ఈదుల నారాయణరెడ్డి, శివారెడ్డి, దేవసహాయం, డొక్కారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాలపెద్దన్న, ఉస్మాన్‌బాషా, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారుమంచాలలో ఎమ్మెల్యే ఫ్లెక్సీల చించివేత

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కోసం ఏర్పాటు చేసిన స్వాగతం ఫ్లెక్సీల చించివేత కలకలం రేపింది. పారుమంచాల గ్రామంలో గడప గడప కార్యక్రమం నిర్వహించేందుకు వస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌కు స్వాగతం పలుకుతూ గ్రామ సర్పంచ్ మాధవరం ప్రకాశం, దేవసహాయం, మరికొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు గ్రామంలోని హాస్పటల్‌కు వెళ్లే దారిలో ఏర్పాటుచేశారు. గ్రామానికి చెందిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు 8 ఫ్లెక్సీలను చింపివేశారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కుమారుడు దేవసహాయం గ్రామానికి చెందిన నలుగురిపై అనుమానం వ్యక్తం చేస్తూ జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేదల స్థలాలను సమాధులతో పోల్చడం తగదు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఆర్టీసీ బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ
- చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు



ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు సమాధులు కట్టుకోవడానికేనని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించడం తగదని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలపై శనివారం పట్టణ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతిలో పేద మహిళల పేరిట ఇస్తున్న సెంటు ఇళ్ల స్థలాల్లో సమాధులు కట్టుకోవాలని చంద్రబాబు మాట్లాడటం దారుణమన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలు 23 సీట్లకే పరిమితం చేసినా ఆయనకు సిగ్గు రాలేదన్నారు. ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షకూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్ హుసేన్, సింగిల్ విండో చైర్మన్లు సిగినేల హుసేనయ్య, మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు దిలీప్‌రాజు, సర్పంచు నవీన్, రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వనజ, రత్నం, విక్టర్, గోవర్ధన్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, రఘునాథరెడ్డి, ఇనాయతుల్లా, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



పటేల్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన ఎమ్మెల్యే , వైఎస్సార్‌సీపీ నాయకులు

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

మహానంది: ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బండిఆత్మకూరు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. పార్నపల్లె గ్రామంలో శనివారం పర్యావరణ పరిరక్షణపై సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ షబ్బీర్ అలి, కడిపిరెడ్డి దిలీప్‌కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్లు 22 లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 22వ తేదీలోగా సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని ఎస్టీఓ ఆర్ వెంకటరమణ శనివారం తెలిపారు. శ్రీశైలం సబ్‌ట్రెజరీ కార్యాలయ పరిధిలో 832 మంది సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లు ఉన్నారన్నారు. తమ ఆధార్ నంబర్, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నంబర్ తో సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు.

23న సామాజిక తనిఖీ

కొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఈ నెల 23న ఉపాధి పనులపై సామాజిక తనిఖీలో భాగంగా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ రాజు నాయక్ శనివారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 01.04.2022 నుంచి 31.03.23 వరకు జరిగిన పనులపై బహిరంగ చర్చ జరుతుందన్నారు.

పర్యావరణహిత జీవనశైలి అలవర్చుకోవాలి



గిరిజనులతో ప్రమాణం చేయిస్తున్న అటవీరేంజ్ అధికారులు

శ్రీశైలం: పర్యావరణహిత జీవన శైలిని అలవర్చుకోవాలని శ్రీశైలం మండల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ నరసింహులు అన్నారు. క్షేత్ర పరిధిలోని మాణిక్యేశ్వరి మాత చెంచుగూడెం, శ్రీశైలంలోని కర్ణాటక సత్రం పరిసర ప్రాంతాల్లో, మేకల బండ, హఠకేశ్వరం ప్రదేశాల్లో శనివారం పర్యావరణహిత జీవన శైలి (మిషన్ లైఫ్) కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నీటిని పరిరక్షించడం, వ్యర్థ పదార్థాలను తగ్గించడం, ప్లాస్టిక్‌వాడకాన్ని నిషేధించడం తదితర అంశాలపై గూడెం వాసులకు అవగాహన కల్పించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. అనంతరం పర్యావరణ హిత జీవనశైలి అనుసరిస్తామని గిరిజనులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది మదన్‌కుమార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్ సలాం అల్లా, భీమ్ నాయక్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సర్వమంగళకారిణి భగవద్గీత



భక్తుల చేత కుంకుమార్చన పూజలు చేయిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

పగిడ్యాల: శ్రీకృష్ణ భగవానుడు మానవాళికి అందించిన భగవద్గీత సర్వ మంగళకారిణి అని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని బీరవోలు సుంకులా పరమేశ్వరి దేవి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముగింపు రోజైన శనివారం గోపూజ, కుంకుమార్చన, ఇతర పూజా కార్యక్రమాలను నిర్వహించి శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీత గ్రంథాలలోని ప్రవచనాలను వినిపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, ఉమామహేశ్వరం పీఠం బొగ్గుల శివారెడ్డి, చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు రమణయ్య శెట్టి, పెద్ద శివన్న, భజన మండలి అధ్యక్షులు నారాయణ, బాలస్వామి, కుమారమ్మ, కవితమ్మ తదితరులు పాల్గొన్నారు.

నలభై ఏళ్ల సమస్య పరిష్కారం

- బండిఆత్మకూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- రూ. 1.05 కోట్లతో డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే శిల్పా భూమిపూజ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: వర్షం వస్తే చాలు ఇళ్లల్లోకి నీళ్లు చేరుతుండంతో ఆ కాలనీ వాసులు నలభై ఏళ్లుగా నరకం అనుభవిస్తూనే వస్తున్నారు. ప్రభుత్వాలు మారినా అధికారులు పర్యటించినా సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడంతో బండిఆత్మకూరు వీవర్స్ కాలనీ వాసుల ఆవేదన వర్ణనాతీతం. సమస్యను కళ్లారా చూసిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమస్య పరిష్కారం కోసం నడుంబిగించారు. అనుకున్న వెంటనే వీవర్స్‌కాలనీ(కొత్తకొట్టాల)లో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి రూ. 1.05 కోట్లు మంజూరు చేయించారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేసి, స్వయంగా జేసీబీ నడిపి పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్‌నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి వచ్చిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వీవర్స్‌కాలనీ ప్రజలు భారీ గజమాలలతో, పూలవర్షం కురిపిస్తూ, హారతులిచ్చి అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పేదలకు అందిన లబ్ధిని వివరించారు. ఈ పథకాలన్నీ ఎవరిచ్చారు అని లబ్ధిదారులను అడిగితే ఇంకెవరు సార్...మా సీఎం జగన్ సార్ అంటూ సంతోషంగా చెప్పారు. మళ్లీ ఈ పథకాలు కావాలా వద్దా అంటే ఖచ్చితంగా కావాలి, మళ్లీ మా ఓటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మీకే అంటూ ప్రతి గడపలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ తమ అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, సర్పంచ్ సంధ్య, ఉపసర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ రాజంరెడ్డి సుజాతమ్మ, మండల కో ఆప్షన్ మెంబర్ దూదేకుల జమాల్‌బాషా, దీప్‌కాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి(బాబురెడ్డి), కోడూరు శ్రీరాంరెడ్డి, కాకనూరు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఇటికెల చిన్నసుబ్బారెడ్డి, సీమ సుబ్బారెడ్డి, అవుటాల సుబ్బారెడ్డి, దేసు మనోహర్‌రెడ్డి, దేసు శ్రీనివాసరెడ్డి, నందిపాటి రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.